గడువులోగా ప్రవేశం పొందని సీట్లు రద్దు

శ్రీకాకుళం అర్బన్ : ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)సి అనుసరించి 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ప్రయివేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు నమోదు చేసుకున్న విద్యార్థుల ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత జాబితాలను ఇప్పటికే విడుదల చేశామని, రెండో విడత సీట్ల భర్తీకి జాబితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఎంపికైన ప్రయివేటు పాఠశాలల్లో ఈనెల 28వ తేదీ లోగా చేరాలని లేకుంటే వారి సీటు రద్దవుతుందని స్పష్టం చేశారు. అడ్మిషన్ కోసం వచ్చిన విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రయివేటు యాజమాన్యాలు అడ్డంకులు సృష్టిస్తే సంబంధిత యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల ఎంపిక జాబితా http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

దువ్వాడ దూకుడుకు బ్రేక్

టెక్కలి నియోజకవర్గ వైసిపిలో గ్రూపుల పోరులో గెలిచి నిలిచిన ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ శ్రీనివాస్, కుటుంబ రాజకీయ ఆధిపత్య పోరులో నిలబడలేకపోయారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వీర విధేయునిగా ఉన్న ఆయనకు కలలో కూడా ఊహించని పరిణామం చోటుచేసుకుంది. వచ్చే ఎన్నికల్లో టెక్కలి అభ్యర్థిగా దువ్వాడను సిఎం ప్రకటించిన నెల రోజుల్లోనే నిర్ణయం మార్చుకోవాల్సి వచ్చింది. దువ్వాడ స్థానంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆయన సతీమణి వాణిని నియమించి, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆమెనే అధిష్టానం ఖరారు చేసింది. దీంతో దువ్వాడ దూకుడుకు ఇక బ్రేక్ పడినట్లయింది.

- వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వాణి నియామకం
- కుటుంబంలో విభేధాలే కారణమని ప్రచారం
- స్వయంకృతాపరాధమే అంటున్న శ్రేణులు
- వాణికి నాయకుల సహకారంపై నెలకొన్న సందేహాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

దువ్వాడ శ్రీనివాస్ 2013లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అటు పార్టీకి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అత్యంత విధేయుడిగా ఉంటూ వచ్చారు. అతనిపై విశ్వాసంతో పార్టీ అధిష్టానం అనేక అవకాశాలను కల్పించింది. తొలుత టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో టెక్కలి నుంచి వైసిపి అభ్యర్థిగా ఓటమి తర్వాత కొద్ది నెలలకు సమన్వయకర్తగా నియమించింది. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌ను గెలిపించేందుకు టెక్కలిలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వయంగా ఎన్నికల ప్రచారం చేయడంతో పాటు అన్నిరకాల వనరులను కల్పించారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే అవకాశం కల్పించింది. ఎంపీ అభ్యర్థిగా ఓటమి తర్వాత కూడా అతన్ని అక్కున చేర్చుకుంది. 2021 మార్చిలో ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ సీటు ఇచ్చి గౌరవించింది. నియోజకవర్గానికి చెందిన సొంత పార్టీ నేతలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వద్ద పలుమార్లు ఫిర్యాదు చేసినా వాటిని పట్టించుకోలేదు. దువ్వాడకే అండగా నిలిచారు.

అభ్యర్థిగా ప్రకటన... అంతలోనే అనూహ్య నిర్ణయం

2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో వైసిపి అభ్యర్థుల పేర్లు ఎవరివి ప్రకటించకపోయినా, టెక్కలి నుంచి దువ్వాడ శ్రీను పోటీ చేస్తారని సిఎం జగన్ ప్రకటించారు. ఆయన్ను మీ చేతుల్లో పెడుతున్నానని, ఆయనకు అండగా నిలవాలని మూలపాడు పోర్టు శంకుస్థాపన సందర్భంగా బహిరంగ సభలోనూ సిఎం ప్రకటించారు. టెక్కలిలో గ్రూపుల పోరు, దువ్వాడ శ్రీనివాస్ వైఖరిపై అసంతృప్తి నేపథ్యంలో అభ్యర్థిని మారుస్తారంటూ ప్రచారం సాగుతున్న సమయంలో శ్రీనివాస్ పేరును ప్రకటించడం ఆయన వ్యతిరేక వర్గీయులు కొంత షాక్‌కు గురయ్యారు. టెక్కలి సీటుకు తన పేరును ప్రకటించడంతో తనకు ఇక ఎదురులేదని ఆయన భావించారు. అయితే అనూహ్యంగా ఆయన సతీమణి దువ్వాడ వాణి నుంచి పోటీ ఎదురవుతుందని ఊహించలేదు. భార్యభర్తల మధ్య వివాదాలు నెలకొన్నాయంటూ గతంలో విస్తృత ప్రచారం సాగింది. దీనిపై దువ్వాడ వాణి విలేకరుల సమావేశం నిర్వహించి, తమ మధ్య అటువంటి విభేదాలేమీ లేవని ప్రకటించారు. అంతలోనే ఈనెల 25వ తేదీన శ్రీనివాస్ స్థానంలో వాణిని నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఇన్‌ఛార్జి మార్పుపై రకరకాల చర్చలు

టెక్కలిలో చోటుచేసుకున్న పరిణామాలపై ఎమ్మెల్సీ శ్రీనివాస్ శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి అధిష్టానం నిర్ణయాన్ని ప్రకటించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో దువ్వాడ వాణి టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుండడాన్ని గమనించానని, ఫలితంగానే టెక్కలి అసెంబ్లీకి వాణిని ప్రకటించారంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. మహిళా సాధికారతే అనుకుంటే ఎమ్మెల్సీగా వాణినే గతంలో అధిష్టానం ప్రకటించి ఉండేది. అలా జరగలేదంటే అది మహిళా సాధికారత కాదనే చర్చ నాయకుల్లో సైతం సాగుతోంది. పైగా టెక్కలి ఎమ్మెల్యేగా శ్రీనివాస్ పోటీ చేస్తారని బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన తర్వాత కూడా అభ్యర్థిని మార్చారంటే బలమైన కారణమే ఉండవచ్చనే చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

కారణాలు ఇవేనా..?

దువ్వాడ కుటుంబంలో కొంతకాలంగా నెలకొన్న కలహాలు ఇటీవల పతాకస్థాయికి చేరినట్లు తెలిసింది. ఇప్పటికే పలుమార్లు పార్టీ పెద్దలను, సిఎంఒ అధికారులు కలిసి ఎమ్మెల్సీ శ్రీనివాస్ బలహీనతలు, వ్యవహారశైలిని వివరించినట్లు తెలిసింది. వాణి తన కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సైతం ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారానికి ముగింపు పలకడానికి ఈనెల 25వ తేదీన ఇరువురిని పిలిచి మాట్లాడారు. దీంతో దువ్వాడ వాణినే పార్టీ ఇన్‌ఛార్జిగా నియమించాలని అంతిమంగా అధిష్టానం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.



వాణికి సహకరిస్తారా..?

పార్టీ ఇన్‌ఛార్జి పదవి నుంచి శ్రీనివాస్‌ను తప్పించి వాణికి అప్పగించిన నేపథ్యంలో నియోజకవర్గ పార్టీ నాయకుల నుంచి ఏమేరకు ఆమెకు సహకారం ఉంటుందనేది చూడాల్సి ఉంది. ఇప్పటికే నియోజకవర్గంలో తీవ్రస్థాయిలో గ్రూపుల పోరు కొనసాగుతోంది. ప్రతి మండలంలో తిలక్, దువ్వాడ వర్గీయులుగా పార్టీ రెండుగా చీలిపోయింది. దీంతోపాటు ఎమ్మెల్సీ దువ్వాడ ఒంటెత్తు పోకడలతో నియోజకవర్గ నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. వారెవరూ వాణికి మద్దతుగా నిలిచే అవకాశం లేదని పార్టీలోనే చర్చ సాగుతోంది. దీనికితోడు ఇప్పుడు దువ్వాడను తప్పించడంతో అతని వెంట ఉన్న నాయకుల వైపు నుంచి కూడా వాణి నియామకంపై కనీస స్పందన కనిపించడం లేదు. దువ్వాడ వ్యతిరేక వర్గీయులు, టిడిపి నాయకులు దువ్వాడ కుటుంబంలో జరుగుతున్న పరిణామాలపై లోలోపల సంతోషపడుతున్నారు. కాగల కార్యం గంధర్వులే తీర్చారంటూ అనుకుంటున్నారు. అంతా దువ్వాడ శ్రీనివాస్ స్వయంకృతాపరాధమేనని పార్టీ నాయకులు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తమ్మీద అధిష్టానం నిర్ణయంతో నియోజకవర్గంలో మంచి దూకుడు మీద ఉన్న దువ్వాడకు బ్రేకులు వేసినట్లయింది.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మికులకు వైద్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఇఎస్‌ఐ డిస్పెన్సరీలు ప్రారంభించాలి
- డిస్పెన్సరీ, ప్యానల్ క్లినిక్‌లో రిఫరల్ సౌకర్యం కల్పించాలి
- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మూసివేసిన ఎచ్చెర్ల, శ్రీకాకుళం ఇఎస్‌ఐ డిస్పెన్సరీలను వెంటనే ప్రారంభించాలని, ఇఎస్‌ఐలో కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇఎస్‌ఐని బలోపేతం చేయాలని, మూసివేసిన ఎచ్చెర్ల, శ్రీకాకుళం ఇఎస్‌ఐ డిస్పెన్సరీలను వెంటనే ప్రారంభించి వైద్యులు, సిబ్బందిని నియమించి వైద్య సేవలందించాలని, జిల్లాలో ఇఎస్‌ఐ రిఫరల్ హాస్పిటల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన నగరంలోని కార్మిక రాజ్య బీమా సంస్థ (ఇఎస్‌ఐ) కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వైద్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వేల మంది కార్మికులున్న ఎచ్చెర్ల, జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ఇఎస్‌ఐ డిస్పెన్సరీలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. 2019 మార్చిలో ఎచ్చెర్ల, శ్రీకాకుళంలో ఇఎస్‌ఐ డిస్పెన్సరీలు ప్రారంభించినా వైద్యులు, సిబ్బందిని నియమించలేదని విమర్శించారు. చివరకు కార్మికులకు ఎటువంటి సమాచారం లేకుండా గతేడాది వాటిని మూసివేసిందని చెప్పారు.

జిల్లాలో వంద పడకల ఇఎస్‌ఐ ఆస్పత్రి లేకపోవడంతో ప్రమాదానికి గురైన కార్మికులకు సకాలంలో సరైన వైద్యం అందక ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సుమారు 26 వేల మంది కార్మికుల నుంచి బీమాగా ఇఎస్‌ఐ కార్పొరేషన్‌కు నెలకు సుమారు రూ.1.50 కోట్లు చెల్లిస్తున్నా కార్మికులు సరైన వైద్యం అందడం లేదన్నారు. ఇఎస్‌ఐ డిస్పెన్సరీ, ప్యానల్ క్లినిక్‌లో రిఫరల్ సౌకర్యాన్ని ఎత్తివేసి, కార్మికులకు వైద్యాన్ని దూరం చేసిందని విమర్శించారు.

జిల్లాలో ఇఎస్‌ఐ పరిధిలో సుమారు 26 వేల మంది కార్మికులున్నా లోకల్ పే ఆఫీసు లేకపోవడంతో, సెలవు కోసం పక్క జిల్లాకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పైడిభీమవరంలో ఇఎస్‌ఐ పది పడకల డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణం కొన్ని సంవత్సరాలైనా పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేసి ప్రారంభించాలని, పైడిభీమవరం ఇఎస్‌ఐ డిస్పెన్సరీలో ఐదుగురు స్పెషలిస్టు డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఇఎస్‌ఐ డిస్పెన్సరీ, ప్యానల్ క్లినిక్‌లో రిఫరల్ సౌకర్యం ఎత్తివేస్తూ ఇఎస్‌ఐ కార్పొరేషన్ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేసి గతంలో మాదిరిగా రిఫరల్ సౌకర్యం కల్పించాలన్నారు. డిస్పెన్సరీల్లో అన్నిరకాల మందులు కొరత తీర్చి కార్మికులకు పూర్తిస్థాయిలో మందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ధర్నా అనంతరం ఇఎస్‌ఐ శ్రీకాకుళం బ్రాంచ్ మెడికల్ ఆఫీసర్ ఆర్.నాయుడుబాబు, బ్రాంచి మేనేజర్ పి.రమేష్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, జిల్లా కోశాధికారి అల్లు సత్యన్నారాయణ, నాగార్జున అగ్రికెమ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వరదరాజు, ఎం.రమణ, శ్యాంక్రగ్‌పిస్టన్స్ అండ్ రింగ్స్ వర్కర్స్ యూనియన్ ప్లాంట్-3 నాయకులు పి.దుర్గాప్రసాద్, నాగార్జున అగ్రికెమ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.గోపాలుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న వారందరికీ వంద రోజులు పని కల్పించేందుకు అవసరమైన అంచనాలను వేసి పరిపాలనా ఆమోదం పొందాలన్నారు. పంచాయతీ స్థాయిలో ప్రజాప్రతినిధులకు అవసరమైన సమాచారాన్ని అందించాలని తెలిపారు. వివాదాలకు ఆస్కారం లేకుండా అడిగిన వారందరికీ ఉపాధిని కల్పించే బాధ్యత ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనులు చేపట్టాల్సిందేనని స్పష్టం చేశారు. కూలీలు ఉపాధి పనులకు వచ్చే విధంగా అవసరమైన చర్యలు క్షేత్రస్థాయి సిబ్బంది చేపట్టాలని సూచించారు. వివాదాలకు దూరంగా ఉంటూ ప్రవర్తన, మాట తీరును మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని అన్ని రకాల కాలువలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి గ్రామాల్లో రైతులకు అవసరమైన పిల్ల కాలువల్లో పనులు చేపట్టాలని సూచించారు. అమృత్ సరోవర్ చెరువు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అంతకుముందు కొత్తపేటలో చేపడుతున్న చెరువు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ రెండు పూటలా పనులు చేయడం ద్వారా గరిష్ట కూలి పొందవచ్చని చెప్పారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ పనులకు వచ్చి ఉపాధి హామీని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎపిడి డి.మురళీకృష్ణ, ఎపిఒ అరుణ్‌కుమార్, క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్, పి.నర్సింహమూర్తి, టి.రాంబాబు, పేడాడ వెంకటరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్

నేను పోటీ చేయడం లేదు

- టెక్కలి అభ్యర్థిగా వాణి పోటీ చేస్తారు
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

వచ్చే ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా తాను పోటీ చేయడం లేదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రకటించారు. వాణిని అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఖరారు చేశారని తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. తనను టెక్కలి అభ్యర్థిగా ప్రకటించాక అన్ని విధాలుగా ఆలోచించి, మహిళ పోటీ చేస్తే బాగుంటున్న అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి ముందుంచానని తెలిపారు. దువ్వాడ వాణికి అవకాశం ఇవ్వాలని కోరగా, సిఎం అంగీకరించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసే వాణికి కేడర్ అంతా సహకరించి, నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

చిరస్మరణీయులు బొడ్డేపల్లి రాజగోపాలరావు

- ఆయన జీవితం భావితరాలకు ఆదర్శం
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాజీ ఎంపీ కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు చిరస్మరణీయులు అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. రాజగోపాలరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టు నిర్మాణ ఆద్యుడు రాజగోపాలరావు అని కొనియాడారు. అయన ఆదర్శ రాజకీయ జీవితం రాబోయే తరాలకు ఆదర్శం కావాలన్నారు. ఆరుసార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆయన్ను ఒక పార్టీకి చెందిన నాయకునిగా కాకుండా జిల్లా అభివృద్ధి ప్రదాతగా చూడాలన్నారు. శ్రీకాకుళాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయించి కేంద్ర ప్రభుత్వం వద్ద వెనుకబడిన జిల్లాగా గుర్తించి నిధుల మంజూరుకు కృషి చేశారని గుర్తుచేశారు. ఆమదాలవలసలో సహకార చక్కెర కర్మాగారం, నైర, రాగోలు, ఆమదాలవలసలో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయించడంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. బి.ఆర్.ఆర్ శత జయంతి ఉత్సవాల నిర్వహణకు కోరిన వెంటనే ప్రభుత్వం తరుపున చేయడానికి అనుమతులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ బొడ్డేపల్లి విగ్రహ ఏర్పాటుకు, నిర్వహణకు అదనపు నిధులు అందజేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గొట్టాబ్యారేజ్ వద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. రాజగోపాలరావు విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తనవంతుగా రూ.లక్ష అందజేస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి వేడుకల్లో భాగంగా జిల్లాలో విగ్రహాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు రూ.20 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో జూన్ 15, 16 తేదీల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్‌టిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల మైదానంలో జూన్ 21న నిర్వహించే ముగింపు ఉత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజగోపాలరావు కుటుంబసభ్యులు బొడ్డేపల్లి సత్యవతి మాట్లాడుతూ రాజగోపాలరావు సేవలను గుర్తించి ప్రభుత్వం అధికారికంగా ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శత జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను, ఎస్‌పి జి.ఆర్ రాధిక, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ వైశ్య కార్పొరేషన్ అంధవరపు సూరిబాబు, పలాస మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, బిజెపి నాయకులు పూడి తిరుపతిరావు, టిడిపి నాయకులు చౌదరి నారాయణమూర్తి, హనుమంతు కృష్ణారావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాలరావు చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు, అధికారులు తదితరులు

బిల్లు పడలేదు... ఇచ్చామని ఎలా చెప్తారు?

'గడప గడప'లో ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌ను నిలదీత

ప్రజాశక్తి - జి.సిగడాం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కు నిలదీతలు తప్పడం లేదు. మండలంలోని వాంద్రంగిలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలోనూ పలువురు పలు సమస్యలపై నిలదీశారు. గ్రామానికి చెందిన రాజారావుకు గృహ నిర్మాణ బిల్లు రూ.2.50 లక్షలు, జగనన్న వసతి దీవెన రూ.1200 పడినట్లు పాంప్లెట్ అందించి ఎమ్మెల్యే వివరించారు. తనకు ఇంటి బిల్లు గానీ, వసతి దీవెన డబ్బులు గానీ తమ ఖాతాలో పడలేదని, డబ్బులు పడకుండా ఇచ్చేశామని ఎలా చెప్తారని నిలదీశారు. విడతల వారీగా పడతాయని ఎమ్మెల్యే బదులిచ్చారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, తహశీల్దార్ పి.వేణుగోపాలరావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి డోల వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మక్కా వెంకటసాయి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతినిధి మామిడి బలరాం, పిఎసిఎస్ చైర్మన్ ఎర్నేని ప్రకాష్, పలువురు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌ను నిలదీస్తున్న లబ్ధిదారులు

గుణాత్మక బోధన అవసరం

పలాస : విద్యార్థులకు గుణాత్మక విద్యనందించేందుకు ఇండక్షన్ ట్రైనింగ్ దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య అన్నారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత ఉపాధ్యాయుల ముగింపు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం ద్వారా అభ్యసన ఫలప్రదమవుతుందని తెలిపారు. అందుకనుగుణంగా తరగతి గదిని మలచాలని చెప్పారు.

జిల్లా ఉప విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ మాట్లాడుతూ విద్యార్థులను నైతిక విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ వై.చిన్నమనాయుడు, మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు, కోర్సు కో-ఆర్డినేటర్ ఎస్.సూర్యప్రకాష్, బలివాడ సతీష్, రాష్ట్ర రీసోర్స్‌పర్సన్లు ఎల్.వి చలం, ఆర్.వి రమణమూర్తి, శ్రీనివాసరావు, పి.షణ్ముఖరావు, కిల్లి ఈశ్వరరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు తేలితే చర్యలు

ప్రజాశక్తి - నౌపడ

ఉపాధి హామీలో నౌపడ ఫీల్డ్ అసిస్టెంట్లపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేసి, వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సంతబొమ్మాళి మండలంలోని నౌపడ సచివాలయం వద్ద ఉపాధి హామీపై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కర్రి దేవానంద రెడ్డి మాట్లాడుతూ గతేడాది పనిచేసిన మూడు బిల్లులు ఇప్పటివరకు చెల్లించలేదని చెప్పారు. ఈ ఏడాది కేవలం మూడు వారాలు మాత్రమే పని కల్పించారని తెలిపారు. పక్క గ్రామాల్లో పని ఇస్తూ తమకు ఉద్దేశపూర్వకంగా ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు ఇవ్వడం లేదని వివరించారు. గ్రామంలో పని ప్రదేశాలున్నా, తమకు పని ఇవ్వడం లేదని చెప్పారు. చేసిన పనులకు వారానికి రూ.వెయ్యి కంటే తక్కువ బిల్లు పడుతోందన్నారు. సుగ్గు చిన్న మాట్లాడుతూ అంచనా విలువ వేసి పనులు ఇవ్వడం లేదని, ఆ సొమ్ము ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. దీనిపై సబ్ కలెక్టర్ మాట్లాడుతూ నిజంగా అన్యాయం జరిగితే తెలియజేయాలి తప్ప రాజకీయ కోణంలో ఆరోపణలు చేయకూడదని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లది తప్పని తేలితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వివాదాలు తలెత్తకుండా ప్రతి జాబ్‌కార్డు దారుని వివరాలు, చెల్లించిన బిల్లుల జాబితాను సచివాలయంలో వెంటనే ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వారంలోగా పనులు గుర్తించి అందరికీ పని కల్పిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, ఎపిడి మురళీకృష్ణ, ఎంపిడిఒ ఉమాసుందరి, ఎపిఒ వాసునాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు సుధాకర్, ఎల్.రాములు, వైస్ సర్పంచ్ రవికుమార్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

మట్టి నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

భూసార పరీక్ష తప్పనిసరి

ప్రజాశక్తి- రణస్థలం

భూసార పరీక్షల ద్వారానే నేల ఆరోగ్యం కాపాడడం సాధ్యమని, అందుకు రైతులు భూసార పరీక్షలు తప్పనసరిగా చేసుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని పతివాడ గ్రామంలోని తవిటినాయుడు పొలంలో శుక్రవారం భూసార పరీక్ష నిర్వహించి మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 535 గ్రామాల్లో వెయ్యి మంది రైతుల పొలాల నుంచి సేకరించిన మట్టి నమూనాలను మెరుగైన పరీక్షా ఫలితాల కోసం హైదరాబాద్‌లోని ఇక్రిసాట్‌కు పంపిస్తున్నామని అన్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయాల్సి వస్తోందన్నారు. హరిత విప్లవం తరువాత నుంచి ఇప్పటి వరకూ కేవలం ఆహార ధాన్యాల ఉత్పత్తిపై మాత్రమే దృష్టిసారించి నేల ఆరోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారని ఆవేదన వ్యక్తం చేసారు. నేల నిర్జీవ పదార్థం కాదని, నేలలో కోటాను కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయని, నేల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. రైతులు తమ పొలాల్లోని మట్టిని వర్షాధార భూముల్లో మూడేళ్లకోసారి, నీటి వసతి కింద మూడు పంటలకు ఒకసారి మట్టిని పరీక్షిస్తే భూసారాన్ని కాపాడుకోగలమన్నారు. అధిక, సుస్థిర దిగుబడులను పొందవచ్చన్నారు.

పశు బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- రణస్థలం

దుర్గారావు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రణస్థలం పశుసంవర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బంటుపల్లి దుర్గారావు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వివిధ రకాల వ్యాధులు, ప్రమాదవశాత్తు పశువులు మృతి చెందితే రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. తెల్ల రేషన్ కార్డులు ఉన్న రైతులు 50 శాతం ప్రీమియం చెల్లించాలన్నారు. పశువులకు మూడేళ్ల పాటు జీవాలకు, పందులకు ఒకటి రెండు, మూడేళ్ల పాటు బీమా పథకం వర్తిస్తుందని చెప్పారు. పశువులు మృతి చెందిన 21 రోజుల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమవుతుందని అన్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు పెంపకందారులు బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. పెంపకందారులు తమ సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రానికి వెళ్లి వారి పశువుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

నేడు స్పీకర్ సీతారాం పర్యటన

బూర్జ: మండలంలోని కొల్లివలస బాలయోగి రెసిడెన్షియల్ స్కూల్‌లో వాలంటీర్లకు వందనం అనే కార్యక్రమానికి శాసనసభ తమ్మినేని సీతారాం రానున్నారని ఎంపిడిఒ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో పనిచేస్తున్న వాలంటీర్లు, కార్యదర్శులు, ఎంపిపి, జెడ్‌పిటిసి, పిఎసిఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొవాలని సూచించారు.

వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన వాలంటీర్లు వ్యవస్థ ఎంతో మహోన్నతమైనదని, అటువంటి వ్యవస్థలో పనిచేస్తున్న వాలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనిదని రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమలరావు అన్నారు. మండలంలోని రెంటికోట సచివాలయంలో పని చేస్తున్న వాలంటీర్లకు శుక్రవారం ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లు పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం కన్నా మించి పనిచేయడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి సద్గుణరావు, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో వాలంటీర్లు ఉత్తమ సేవలు అందించినందుకు గుర్తుగా కౌన్సిలర్లు దిలీప్, గేదెల శేఖర్ సన్మానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించడంలో వాలంటీర్లు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ రత్న, వెల్ఫేర్ శ్రావణి, మహిళా కానిస్టేబుల్ నందిని పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: ఆర్.హెచ్.పురం సచివాలయం పరిధిలో జగన్నాథపురం, ఆర్.హెచ్‌పురం పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రామ వాలంటీర్లకు ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, సర్పంచ్‌లు జోగి రాములమ్మ, ఎన్ని మన్మథరావులు ఘనంగా సన్మానంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి

సోంపేట : వాలంటీర్లను సన్మానిస్తున్న ఎంపిపి దాసు

కె.రాజేంద్రప్రసాద్, విఆర్ఒ బి.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని కర్తలిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు ఎంపిపి ఎన్.దాసు సన్మానించారు. నిస్వార్థంగా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్న వాలంటీర్ల సేవలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా సేవ మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రూపవతి, సర్పంచ్ గున్నయ్య, పిఎసిఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, శంకర్, గోపయ్య, వేసి శ్యాం, ధర్మారావు, బాలరాజు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : వాలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

పలాస : వాలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్ తిరుమలరావు

ఇచ్ఛాపురం : వాలంటీర్లను సన్మానిస్తున్న వార్డు కౌన్సిలర్లు

'మహానాడు'కు నాయకుల పయనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడుకు మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీ దేవి తన కేడర్‌తో శుక్రవారం ప్రజారథంలో బయలుదేరి వెళ్లారు. ముందుగా అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అలాగే ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సూర్యమహల్ కూడలి నుంచి డేఅండ్‌నైట్ కూడలి వరకూ టాప్ వ్యాన్‌లో ప్రజలకు అభివాదం చేస్తూ... ముందుకు సాగారు. తెలుగు ధనం ఉట్టిపడేలా ఎండ్ల బండి బొమ్మను వ్యాన్‌కు ఏర్పాటు చేయడంతో అందరినీ ఆకర్షించింది.

పాతపట్నం : నినాదాలు చేస్తున్న టిడిపి నాయకులు

పొందూరు : టిడిపి జెండా ఊపుతున్న రామ్మోహన్

పలాస: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా టిడిపి ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మినీ మహానాడు కార్యక్రమానికి టిడిపి నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. పలాస నుంచి నాలుగు బస్సులతో పాటు వివిధ కారుల్లో, వాహనాల్లో తరలివెళ్లారు. మినీ మహానాడు కార్యక్రమానికి వెళ్లిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్త, నాగరాజు, శాసనపురి మురళి, జోగ మల్లి, డొక్కరి శంకర్, ఆత్మరావు, పైల చక్రధర్ బూరెల విజయ్, బూరెల కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

పొందూరు: రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న మహానాడుకు టిడిపి నాయకులు కార్లు, ఇతరు వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. మండల కేంద్రంలో ఈ వాహనాలను మండల టిడిపి అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ టిడిపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సభకు టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరభాస్కరరావు, బాడాన శేషగిరి, ఎం.సీతారామారావు, బొడ్డేపల్లి సత్యం, అనకాపల్లి శ్రీరంగ, పైడి వాసు, పైడి రామారావు తదితరులు తరలివెళ్లారు.

పాతపట్నం : రామహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహానాడుకు టిడిపి నాయకులు మామిడి గోవిందరావు ఆధ్వర్యాన టిడిపి నాయకులు బస్సులో బయలు దేరారు. గోవిందరావు నాయకత్వం వర్ధిల్లాలి, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి అని నినదిస్తూ ముందుకు సాగారు.

పలాస : కారులో పయనమవుతున్న బాబూరావు, నాయకులు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండలంలోని గంగాధరపేటకు చెందిన బమ్మిడి లక్ష్మణరావు శుక్రవారం తన శరీరంపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటిచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. టెక్కలిలోని జెడ్‌పి రోడ్డులో ఓ దుకాణం వద్ద లక్ష్మణరావు ఆస్తి తగాదాల్లో తన సమీప బంధువుతో వాగ్వివాదం పడ్డాడు. సొంత బంధువులే తనకు అన్యాయం చేస్తున్నారన్న మనస్థాపనానికి గురయ్యాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి మంటలను అదుపు చేసి వెంటనే టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పొందూరు: మండలంలోని కృష్ణాపురం సమీపంలో శుక్రవారం రాత్రి కారు ఢీకొని అదే గ్రామానికి చెందిన కెల్ల చంద్రరావుకి తీవ్ర గాయాలయ్యాయి. పొందూరు నుంచి స్వగ్రామానికి సైకిల్‌పై వెళ్తున్న చంద్రరావును వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న గ్రామస్తులు అక్కడ చేరుకుని చంద్రరావును చికిత్స కోసం శ్రీకాకుళం ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి పార్వతీశంపేట సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి బొడ్డేపల్లిపేట ఫీడర్ పరిధిలో ఉన్న బొడ్డేపల్లిపేట నుంచి పూజారిపేట వరకు రోడ్డు వెడల్పు పనులు చేస్తున్నారని అన్నారు. ఈ కారణంగా పొడవాటి స్తంభాలు వేయడం, తీగలు అమర్చడం వంటి పనుల కారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. ప్రజలందరూ గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మారడికోట పంచాయతీలోని కొత్తమారడికోట, పాతమారడికోట, ఛీడిపాలెం, సవరచిడిపాలెం, నాయుడుపోలూరు, సవరపోలూరు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దింటి భాగ్యం, సర్పంచ్ ప్రతినిధి పెద్దింటి శ్రీనివాసరావు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, ఎంపిడిఒ పి.చంద్రకుమారి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శుభ్రం చేసిన చెత్త కుండీ

చెత్త తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ నుంచి పలాస వరకు రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ నెల 25న 'ప్రజాశక్తి'లో 'చెత్త కుండీలు నిండినా పట్టించుకోరా'? శీర్షికతో కథనం ప్రచురితమైంది.

కుండీలో పేరుకుపోయిన చెత్తా చెదారం (ఫైల్)

దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు సమీపం ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పలాస జీడి పిక్క బొమ్మ మధ్యలో ఉన్న చెత్త కుండీలో పేరుకుపోయిన చెత్త చెదారాలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ సీతారాం మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎక్కడెక్కడ పేరుకుపోయినా తొలగిస్తామని తెలిపారు.

అందరికీ తాగునీరు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పనులను ప్రారంభిస్తున్న ఈశ్వరరావు

అందరికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రయత్నం చేస్తున్నామని గరుడభద్ర సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న జల జీవన్ మిషన్‌లో భాగంగా చిన్నతర్లాగడూరులో బోరు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి ఇబ్బందులను పరిష్కరించడమే ధ్యేయమన్నారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో పంచాయతీలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కె.యోగీశ్వరరావు, కె.ప్రకాష్, సోమేష్, శంకరరావు, పి.భీమారావు, కె.కృష్ణారావు, ఢిల్లీరావు, వై.పాపారావు, కేశవరావు, తాతారావు, కె.రవి, నాని, కె.యాదవ, రావులక్ష్మణ్ పాల్గొన్నారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

బూర్జ : వచ్చే ఖరీఫ్‌కు సంబంధించిన వరి విత్తనాలు రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తామని ఇఒ వావిలపల్లి రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయే వరి విత్తనాలు కావాలో రైతులు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా ఎపి సీడ్ కార్పొరేషన్‌కు తగిన డబ్బు చెల్లించాలని సూచించారు. అలాగే గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై వరి విత్తనాలను అందిస్తామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుష్పగుచ్ఛాలను అందజేస్తున్న కమిషనర్ రమేష్

కష్టపడితే ఉజ్వల భవిష్యత్

ఇచ్ఛాపురం: కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రమేష్ అన్నారు. స్థానిక శాంతి నికేతన్ విద్యా సంస్థలో చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి అధ్యక్షతన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదవి మంచి ఫలితాలు సాధించి ముందుకు సాగాలన్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పి.శ్రీయరెడ్డి, అన్వేష త్రిపాఠి, పి.నవ్య, పి.దయానంద, ఎం.సత్యా, డి.జయప్రకాష్‌లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సురేఖ, కె.సి.పూరి, శంకర్, శ్రీధర్, పద్మజ, శాంతి పాల్గొన్నారు.

దుప్పట్లను పంపిణీ చేస్తున్న నీలయ్య

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

కవిటి: పాడి రైతులను ప్రోత్సహించడం విశాఖ డెయిరీ ముందంజలో ఉందని, రైతులు వేసే పాలకు సరైన గిట్టుబాటు ధర అందిస్తూ, ఏటా బోనస్ కూడా అందిస్తూ మేలు చేకూరుస్తుందని ఎఎంసి వైస్ చైర్మన్ యలమంచి నీలయ్య అన్నారు. మండలంలోని భైరిపురంలో విశాఖ డెయిరీ ఆధ్వర్యాన పాడి రైతులకు శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. విశాఖ డెయిరీ సూపర్ వైజర్ కెజివి ప్రసాద్ మాట్లాడుతూ ఇచ్ఛాపురం బిసిసి పరిధిలోని 36 గ్రామాల్లో సుఖీభవ కార్డు కలిగిన 1486 మంది పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఏజెంట్ ఎస్.మహేశ్వరరావు, కార్యదర్శి శంకర్, భార్గవ్, బి.ప్రసాద్, శ్రీపతి పాల్గొన్నారు.


విచారణ చేపడుతున్న డిసిహెచ్ఒ భాస్కరరావు

సమయపాలన తప్పనిసరి

పొందూరు : పొందూరు సామాజిక ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాల్సిందేనని, పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని డిసిహెచ్ఒ భాస్కరరావు హెచ్చరించారు. పొందూరు సామాజిక ఆస్పత్రిలో ఈనెల 24 రాత్రి 8 గంటల సమయంలో సిబ్బంది లేకపోవడంతో వేరొక ఆస్పత్రికికి 108 వాహనంలో తరలించడంపై శుక్రవారం విచారణ చేపట్టారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో ప్రసవాలుసంఖ్య పెంచాలంటూ సిబ్బందికి సూచించారు.

శ్మశాన స్థలాన్ని అప్పగించాలని వినతి

ఇచ్ఛాపురం : పట్టణంలో తమకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలం సర్వే చేసి అప్పగించాలని మండల పాస్టర్స్ ఫెల్లో షిప్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ గురుప్రసాద్‌కు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. క్రిస్టియన్లకు సరైన శ్మశాన వాటిక లేదని, 2018లో సర్వే నంబరు 177/పిలో ఎకరా భూమి కేటాయించారని అన్నారు. కానీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి అప్పగించకపోవడం అంతిమ సంస్కరణలకు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. దీనిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, మండల పాస్టర్స్ ఫెలో షిప్ ప్రతినిధులు డి.ఏళ్లయ, సుందర రాజ్, భీమ్మో తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న క్రిస్టియన్లు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

మండలంలోని ఉద్దానరామకృష్ణాపురంలో రాగోలు జెమ్స్, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సహకారంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని స్పందన లభించిందని ఫౌండర్ విజయ్ తెలిపారు. ఇటీవల కాలంలో చాలా మంది కేన్సర్‌తో, కిడ్నీ సమస్యలతో, గుండెపోటుకు గురై తమ ప్రాణాలను కోల్పోతున్నారని, చాలా అనారోగ్యాలకు గురవుతున్న కారణంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని అన్నారు. ఇందులో 250 మంది రోగులకు వైద్యులు సాయినాథ్, దివ్య వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో చంటి, వాసు, కిషోర్, పాపరావు, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రొక్లెయినర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

పొందూరు: మండలంలోని లైదాంలో కొత్త చెరువులో ఆక్రమణలను శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. దీనిపై గ్రామంలోని కొత్త చెరువును కొందరు ఆక్రమించడం ద్వారా చెరువు ఆయుకట్టులో ఉన్న వందల ఎకరాలకు సాగునీరు సరఫరాలో ఇబ్బంది కలుగుతుందని గ్రామానికి చెందిన ఉత్తరాంధ్ర చెరువు పరిరక్షణ సమితి ప్రతినిధులు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఆక్రమణలను తొలగించాలని స్థానిక రెవెన్యూ అదికారులను ఆదేశించారు. దీంతో కోటిపల్లి రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబరు 28లోని 3.17 ఎకరాల విస్తర్ణం గల ఈ చెరువులో 22 మంది రైతులు చేపట్టిన ఆక్రమణలను తహశీల్దార్ ఎస్.రాంబాబు, ఆర్ఐ రాధ, విఆర్ఒ లోకేష్‌ల సమక్షంలో ప్రొక్లెయినర్ సహాయంతో తొలగించారు.

సంక్షిప్త వార్తలు

పలువురికి ఆర్థికసాయం

శ్రీకాకుళం : మందస మండలం పిల్లి బుదర్సింగికు చెందిన కె.ధనలక్ష్మి ఆశావర్కర్ సహాయంతో జిల్లా సర్వజనాస్పత్రిలో పండింటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ వచ్చింది. భర్త ఆరు నెలల క్రితం ఎటో వెళ్లిపోవడం, మరో వైపు కుటుంబ సభ్యులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న మదర్స్ హెల్పింగ్ సొసైటీ ఫౌండర్ పైడి ప్రదీప్ కుమార్ దాతల సహకారంతో రూ.6 వేలు మందుల కోసం శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. మదర్స్ హెల్పింగ్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ వై.మధు, సెక్రటరీ అప్పలరాజు, జాయింట్ సెక్రటరీ బీర్జారీ, జిల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి పొడుగు చరణ్ పాల్గొన్నారు.

నగరంలోని బొందలిపురం ఏ వన్ వైద్యశాలలో అతితక్కువ బరువుతో, హైలిన్ మెమ్బ్రేన్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి అండగా అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ టీమ్ ముందుకొచ్చింది. ఈ మేరకు రూ.32 వేలు ఆర్థికసాయం అందజేశారు. చిన్నారి వైద్యానికి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని పరీక్షించిన వైద్యులు చెప్పారని అన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలో గోపినాథపురానికి చెందిన ఆళ్ల హరికృష్ణ కాళ్లు విరిగి మంచాని పరిమితమయ్యారు. అలాగే మేధర వీధిలో పిల్లి జగ్గారావు ప్రమాదంలో గాయపడి వెన్నెముకకు ఆపరేషన్ చేయించుకున్నారు. వీరి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశామని అభయం యువజన సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. అభయ సేవ సంఘ సభ్యులు రమేష్, నాగరాజు, శ్రీను, పి.ఈశ్వరరావు, ముక్తేశ్వర్ దాస్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

కొత్తూరు : కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో టిడిపి, ఎన్ఆర్ఐ ఆధ్వర్యాన పేదలకు రూ.5లకే భోజనం అందించేందుకు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సౌజన్యంతో శుక్రవారం అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. టిడిపి హయాంలో ప్రారంభించిన ఎన్‌టిఆర్ అన్న క్యాంటీన్‌ను వైసిపి ప్రభుత్వం మూసివేసిందని కర్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు అన్నారు. ఈ అన్న క్యాంటీన్ ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనునాయుడు, గండివలస తేజేశ్వరరావు పాల్గొన్నారు.

యువత శ్రమదానం

పొందూరు: మండలంలోని కనిమెట్ట ప్రాథమిక పాఠశాల ఆవరణంలోని తాగునీటి బావి పరిసరాలను శుక్రవారం గ్రామానికి చెందిన డ్యాంగిల్ యూత్ సభ్యులు శ్రమదానం చేసి శుభ్రపరిచారు. భావి పరిసరాల్లో మురుగు పేరుకుపోగా, అధికారులు ఎవరూ పట్టించుకోలేదని, దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మురుగునీరు నిల్వ లేకుండా కాలువలో పూడికను తొలగించి తామే శుభ్రం చేసుకున్నామని తెలిపారు.

పిక్కాటపై పోలీసుల దాడి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని వంజంగిలో గురువారం రాత్రి జరిగిన పిక్కాటపై ఎస్ఐ వై.కృష్ణ నేతృత్వంలో పోలీసులు దాడి చేసి నిర్వాహకులను అరెస్టు చేశారు. వంజంగి ప్రధాన రహదారిపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 23న పిక్కాటను నిర్వహించిన నిర్వాహకులు కమిటీకి రూ.లక్ష, పోలీస్ స్టేషన్‌కు కొంత నగదు చెల్లించడంతో పిక్కాటకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సజావుగా సాగిందని, దీంతో గురువారం కూడా ఏర్పాటు చేశామని నిర్వాహకులు అప్పన్న తెలిపారు. అలాగే మూడో రోజు కమిటీకి, శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌కు నగదు చెల్లించామని, ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌కు చెల్లించకపోవడంతో దాడి చేసి అరెస్టు చేశారని ఆరోపించారు. పోలీసులు దాడి చేసిన సమయంలో పిక్కాటపై రూ.రెండు లక్షలు ఉండేవవని, అవి కనిపించడం లేదని నిర్వాహకుడు అప్పన్న తెలిపారు.

చివరకు పోలీసులు రూ.2,250 దొరికినట్లు కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పోలీసులు నిర్వాహకులను అక్కడ నుంచి స్టేషన్‌కు తరలించిన తరువాత యువత తమ డబ్బులు పిక్కాటలో పోయాయని, అనుమతులు లేకుండా ఎలా నిర్వహించారని కోపోద్రిక్తులై పిక్కాట బెంచీలను, లైట్లను ధ్వంసం చేశారు. అలాగే వంజంగి వెంకటేశ్వర స్వామి ఆలయం శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని, కానీ ఆమదాలవలస పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేయడం ఏమిటని వంజంగి గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా పిక్కాటను ప్రభుత్వం ఎప్పుడో నిషేధించినా... కాసులకు కక్కుర్తి పడి పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరించడం తగదని పలువురు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి మున్ముందు కొనసాగితే యువత జూదానికి బానిసై చెడు మార్గాల వైపు పయనించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

లైట్లను ధ్వంసం చేస్తున్న యువకులు

'సికిల్ సెల్ అనీమియా' నిర్ధారణకు

పరికరం ఆవిష్కరణ

పలాస: ప్రస్తుతం శాస్త్ర రంగంలో వివిధ పరికరాలు ఉపయోగించి రక్త నమూనాలు సేకరించి కొన్ని పద్ధతుల ద్వారా సికిల్ సెల్ అనీమియా, కొడవలి కణ రక్తహీనత వ్యాధిని ప్రాథమికంగా నిర్ధారణ చేస్తున్నామని డాక్టర్ దుర్గారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ ఐ.రామస్వామి పూంగోత్తై, ప్రొఫెసర్ వెంకటేశ్వరరావుతో కలిసి తన పరిశోధనలో భాగంగా రక్తనమూనాలు సేకరించకుండా పోర్టబుల్ పరికరాన్ని ఆవిష్కరించామని అన్నారు. ఈ సరికొత్త ఆవిష్కరణతో క్రో జీన్ ఆరోగ్యం బయోటెక్ ప్రయివేట్ లిమిటెడ్, జీన్స్ ఎన్ లైఫ్ హెల్త్ కేర్ ప్రయివేట్ లిమిటెడ్ మరోసారి ఘనతను చాటుకున్నాయని పేర్కొన్నారు. ఆవిష్కరించిన పరికరం ద్వారా సురక్షితమైన, నొప్పిరహిత పద్ధతిలో సికిల్ సెల్ వ్యాధిని ప్రాథమికంగా క్షేత్ర స్థాయిలో గుర్తించవచ్చునని చెప్పారు. సాధారణ రక్త కణాల జీవితకాలం 120 రోజులైతే... సికిల్ రక్త కణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమేనని పేర్కొన్నారు. సికిల్ రక్త కణాలు నశించి పోయేంత వేగంగా కొత్త ఎర్రరక్త కణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురవుతారని అన్నారు. సికిల్ రక్తకణాలు వంపు తిరిగి ఉండటం వల్ల సన్నటి రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సిజన్ అందటం తగ్గిపోతుందని అన్నారు. అందువల్ల ఈ వ్యాధి ఉన్నవారు తగిన చికిత్స తీసుకోకపోతే తక్కువ వయసులోనే చనిపోతారని అన్నారు. జన్యుపరమైన మార్పుల వచ్చే ఈ రక్తహీనత జబ్బుకు సరైన మందులు లేవని పేర్కొన్నారు. ఈ వ్యాధి ఉన్నా పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు మొదలువతాయని అన్నారు.

సికిల్‌సెల్ అనీమియా పరికరం (ఇన్‌సెట్‌లో) డాక్టర్ దుర్గారావు